క్లుప్తంగా

బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పుల్లారావు



ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లింగబోయిన పుల్లారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ... ఈ మేరకు ఆర్ కృష్ణయ్యతోపాటు తనకు సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వెంకయ్య..

కూసుమంచి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బీసీ యువజన విభాగం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన వడ్డెబోయిన వెంకయ్య నియమితులయ్యారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

ఖమ్మంమయూరిసెంటర్: వెనుకబడిన వర్గాలకు రూ.1 లక్ష ఆర్థిక సాయం పథకం దరఖాస్తు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలామందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పథకానికి అప్లై చేసుకోలేక పోయారని, ఈ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని దరఖాస్తుల మీదనే రెవెన్యూ సిబ్బంది దృష్టి పెట్టాలని తెలిపారు.

పరీక్షలకు హాజరుకండి

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు అయిన నైతిక, మానవీయ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఫెయిలైన విద్యార్థులు ఈ పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

రేషన్ దుకాణాల్లో సరుకులు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: రోజురోజుకు పెరుగుతున్న ధరలతో ప్రజలు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారని, రేషన్ దుకాణాల్లో 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినేపల్లి లలిత, టి.ఝాన్సీ, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రాకేష్‌లు అన్నారు. సోమవారం పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం అందజేశారు. మంగతాయి, భరత్, మోహన్‌రెడ్డి, ప్రేమ్ సింగ్, చందు, స్వాతి, నీలా, విజయ, లలిత, స్వరూప, రవీందర్, రాము పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని బోనకల్లు రోడ్డులోని శ్రీరాంనగర్‌లో ఒక స్థలం వివాదంలో సోమవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. స్థలం మాదంటే మాదని ఘర్షణ పడటంతో అక్కడ ఫర్నీచర్ సైతం ధ్వంసం అయ్యింది. కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. ఈ విషయంపై సీఐ శ్రీహరిని వివరణ కోరగా.. భూమి వివాదం కోర్టులో ఉందని, ఎలాంటి కేసు నమోదు చేయలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. మండలంలోని మంగాపురంతండాకు చెందిన భూక్యా రవి, హలవత్ బిక్షం సోమవారం బైక్‌పై నాచేపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో నాచేపల్లి క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి బొడ్రాయిని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు.

'ఆధునిక యుగంలో ఆటవిక చర్యలు'

ఖమ్మంమయూరిసెంటర్: ఆధునిక యుగంలో మూఢనమ్మకాల పేరుతో ఆటవిక చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంగారెడ్డిలో చేతబడి బాణామతి చేస్తున్నారనే నెపంతో దళిత బలహీన వర్గాలకు చెందిన వారిని పంచాయతీ వద్ద కిరాతకంగా దాడికి పూనుకోవడాన్ని కేవీపీఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా..కబ్జా..

పంట కాల్వలనూ వదలని రియల్టర్లు

- కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు
- సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకోని అధికారులు
- మండలంలో పది ఎకరాలపైగానే ఆక్రమణ.. విలువ రూ.20కోట్లు



పెదతండా ఏరియాలో ఆక్రమణకు గురైన పంట కాల్వ

ఖమ్మంరూరల్: కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు ఏకంగా వ్యవసాయ భూములకు వెళ్లే పంట కాల్వలనే కబ్జా చేస్తున్నా జిల్లాలో పట్టించుకునే నాథుడే లేడు. వెంచర్ల పేరుతో అనుమతులు లేకుండా పంట భూములను ధ్వంసం చేస్తూ, అధికారుల అండదండలతో కాల్వల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఎక్కడ వీలు కుదిరితే అక్కడ ప్రభుత్వ భూములను, పంట కాల్వలను ఆక్రమిస్తూ బరితెగిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మంరూరల్, మండలంలో ఈకబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. మండలవ్యాప్తంగా ఇలా ఇప్పటివరకు 10 ఎకరాల వరకు కాల్వల ఆక్రమణ కొనసాగినట్లు జరుగుతున్నా పరిణామాలను బట్టి చూస్తే తెలుస్తోంది. దీని విలువ దాదాపు రూ.20 కోట్ల పైమాటే ఉంటుందంటున్నారు. 33 అడుగులు ఉండాల్సిన పంట కాల్వలు ఆక్రమణలతో చాలా వరకు కుచించుకుపోతున్నాయి. దీంతో పంటపొలాలకు సరిగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ మండలంలోని, పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, గుర్రాలపాడు, ముత్తగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్, ప్రాంతాల్లో ఈ కాల్వల ఆక్రమణ ఎక్కువగా ఉంది. ఎన్ఎస్‌పీకి చెందిన పిల్ల కాల్వల నుంచి పంట పొలాలకు సాగునీటిని మళ్లించేందుకు 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఏదులాపురం చెరువు నుండి పెదతండా గుర్రాలపాడు వరకు సాగునీరు ఇచ్చేందుకు 33 అడుగుల కాల్వను తవ్వారు. ఆ కాల్వ నుండే కొంతకాలం క్రితం వరకు సాగునీరు సక్రమంగానే వెళ్లేది. ఎప్పుడైతే రియల్ వ్యాపారం మొదలైందో అప్పటి నుండి రియల్టర్ల కన్ను పంట కాల్వలపై పడింది. దీంతో క్రమక్రమంగా ఆక్రమిస్తూ దర్జాగా ప్లాట్లు చేయడం, భవన నిర్మాణాలు చేపట్టడం యథేచ్ఛగా నడుస్తోంది.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనల మేరకు పంట కాల్వలను పూడ్చివేయడం గానీ, అనుమతులు లేకుండా కాల్వలపైన మట్టివేసి పైప్‌లైన్ సహాయంతో రోడ్డును నిర్మించడంగానీ చేస్తే నేరం కిందికి వస్తుంది. సాగునీటి వనరులకు సంబంధించిన భూములను ఆక్రమించడం, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టడం, లేదా సొంత ప్రయోజనాలకు కాల్వలను వినియోగించడం చట్ట రీత్యా నేరం అవుతుంది. ఇలాంటి నిబంధనలు ఉన్నప్పుడు సదరు రియల్టర్లు అధికారుల నుంచి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొందిన అనంతరమే కాల్వలపై ప్రజల సౌకర్యార్థం రోడ్డు కానీ భవన నిర్మాణాలు కానీ నిర్మించాల్సి ఉంది.

రియల్టర్ల ఇష్టారాజ్యం.. చోద్యం చూస్తున్న అధికారులు

ఇదిలా ఉండగా అధికారుల అలసత్వమో, నిర్లక్ష్యమో లేదా ఇంకేమైనా కారణమో తెలియదు గానీ రియల్టర్లు మాత్రం కాల్వల ఆక్రమిస్తూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏదులాపురం చెరువు నుంచి మొదలైన కాల్వల ఆక్రమణ పర్వం పెదతండా నుండి గుర్రాలపాడు రెవెన్యూ వరకు కొనసాగుతూనే ఉంది. ఏదులాపురం, పెదతండా, గుర్రాలపాడు రెవెన్యూ ప్రాంతాల్లో వేల ఎకరాల్లో ఉన్న వ్యయసాయ భూములు ఇప్పుడు రియల్ ఎస్టేట్‌గా మారి ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. దీంతో రియల్టర్లు ఈ ప్రాంతం పొడవునా 33 అడుగులు ఉన్న సాగర్ పిల్ల కాల్వను 5 అడుగులకు కుదించి ఆక్రమించారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా కాల్వల ఆక్రమణపై సంబంధిత అధికారులు కల్పించుకొని పంట కాల్వలను కాపాడాల్సి ఉంది.

కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పంటల కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎక్కడైనా ఆక్రమణకు గురయ్యాయా అనే వివరాలను సేకరిస్తున్నాం. రియల్ ఎస్టేట్ పక్కన ఉన్న కాల్వలు ఎంత వెడల్పు ఉంటే అంతే ఉంచాలి తప్ప రియల్టర్లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు. అన్నీ విచారించాకే ఎన్‌ఓసీ ఇస్తున్నాం. ఆక్రమణకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలేది లేదు.

– వెంకటశాస్త్రి, ఇరిగేషన్ డీఈ

నా బంధువులు, బలగం మీరే..

- 'సుడా' చైర్మన్ అభినందన సభలో మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: వెన్నంటే ఉంటూ తన గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తున్న బీసీలు, మైనార్టీలు, వైశ్యులు, ఇతర వర్గాలంతా తన బంధువులు, బలగమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. 'సుడా' పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌కు అభినంధన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. తాను మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచేందుకు ఖమ్మంలో రాపర్తి రంగారావు, శీలంశెట్టి వీరభద్రం, మెంతుల శ్రీశైలం తదితర నాయకులు ఎంతో కృషి చేశారని, రెండో సారి వారితో పాటు బీసీలు, మైనారిటీలు, వైశ్యులు, యాదవులు, పెరిక, వడ్డెర ఇతర అన్నివర్గాల వారు పనిచేశారని తెలిపారు. ఖమ్మం సమాజం ఐకమత్యంగా ఉంటుందని తన గెలుపుతో నిరూపితమైందన్నారు. సంక్షేమ పథకాలు అందించడమే సమసమాజ స్థాపన కాదని.. బీసీలు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడమేనని తెలిపారు. ఇందులో భాగంగా కేఎంసీలో కార్పొరేటర్లుగా ఎనిమిది మంది కాపు సామాజిక వర్గం వారికి సీట్లు ఇచ్చి గెలిపించుకున్నామని, ఇక బీసీలకు ఇంకా మూడు, నాలుగు నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవులు ఇవ్వాల్సి ఉందన్నారు. మున్నూరుకాపు సంఘం బాధ్యులు పారా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో మేయర్ పునుకొల్లు నీరజ, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా డైరెక్టర్ పులిపాటి ప్రసాద్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మురళి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ

నేలకొండపల్లి: మన ఊరు –మన బడి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జాప్యం చేయకుండా వెంటనే ఇవ్వాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మన ఊరు–మన బడి పనుల పై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి, తహసీల్దార్ దారా ప్రసాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంఈఓ బి.రాములు, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, సర్పంచ్‌లు, ఎస్‌యంసీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు అందిస్తాం

పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు సమకూర్చనున్నట్లు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 22 వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం రూ.70 లక్షల విలువైన ప్లేట్లు, గ్లాసులు వారంలోగా సమకూరుస్తామని తెలిపారు.

అధికారులకు వెల్లువెత్తిన వినతులు



ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం విన్నతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా నాయకులు ఇటికల రామకృష్ణ మాట్లాడుతూ.. ఓ ప్రైవేటు పాఠశాలకు అనుమతులు లేవని ఆందోళన చేస్తే అనుమతులు ఏలా ఇచ్చారని ప్రశ్నించారు. సదరు పాఠశాలపై ఏలాంటి చర్యలు తీసుకోకుండా ఎంఈఓ వ్యవహరించారని ఆరోపించారు. నాయకులు యువరాజ్, శివ నాయక్, చందులాల్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు..

రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రామకోటి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రసాద్, తోటపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలని..

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంలో అర్హులైన వారికి ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీపీ బెల్లం ఉమా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా చాలామంది స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా స్థలాలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని..

కౌలు రైతులతో సహా రైతులకు అవసరమైన వడ్డీ లేని రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పరికరాలు ఉచితంగా అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య తహసీల్దార్‌కు వినతిపత్రం అంజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సౌకర్యం కల్పించాలని, సబ్సిడీలు ఒక హక్కుగా ప్రభుత్వం గుర్తించాలని, రుణమాఫీ ఒకేసారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీర్ల వెంకటప్పారావు, మారుతి, మల్లయ్య, నర్సింహారావు, రామయ్య పాల్గొన్నారు.

నేలకొండపల్లి: రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీ.వై.పుల్లయ్య మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులతో సహా రైతులకు వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని కోరారు. ఇఫ్టూ డివిజన్ కార్యదర్శి పుల్లయ్య, చిర్రా భిక్షం, పగిడికత్తుల నాగేశ్వరరావు, గాదె నరసింహారావు, సత్తి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని..

ఖమ్మంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ శ్యాంసన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2022 బడ్జెట్‌లో వర్కర్లకు గౌరవ వేతనం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు వారికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. మోహన్‌రావు, సుధా, రాధ, భద్రమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి పాఠశాలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఖమ్మం ఆర్టీసీ డిపో బస్‌ను ఏర్పాటు చేసి సోమవారం డీఎం బి. శ్రీనివాసరావు ప్రారంభించారు. వెంకటగిరి క్రాస్‌రోడ్, ఇందిరమ్మ కాలనీ ఫేస్1, 2 కాలనీలకు చెందిన విద్యార్థుల కోసం ఈబస్‌ను ఏర్పాటు చేసినట్లు మేనేజర్ తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, విలేజ్ బస్ ఆఫీసర్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

తిరుమలాయపాలెం/ కూసుమంచి: రాజీవ్‌గాంధీ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పాలేరు ఇన్‌చార్జ్ సంధ్యారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర సోషల్‌మీడియా కన్వీనర్ బెల్లంకొండ శరత్ అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విజేతలకు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ బహుమతి ల్యాప్‌టాప్, మహిళకు స్కూటీతో పాటు 40 ప్రత్యేక బహుమతులు అందజేయబడతాయని, 16 నుండి 38 సంవత్సరాల లోపు యువత జూలై 1 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, నాయకులు ఉన్నం రాజశేఖర్, జూలకంటి సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ పాప్యానాయక్, బాజా సత్యానారాయణ, పత్తి నాగేశ్వరరావు, శరత్, రమేష్, రాజేష్, దేవేందర్, హఫీజుద్దీన్, వినోద, పీర్యా నాయక్, వెంకన్న, రాంరెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

2కే రన్ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 21న పటేల్ స్టేడియం నుండి లకారం ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించనున్న వెజిటేరియన్ 2కే రన్‌ను జయప్రదం చేయాలని సామాజికవేత్త, పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కడవెండి వేణుగోపాల్, నేషనల్ వెజిటేరియన్ మూమెంట్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీనివాస్‌లు కోరారు. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. దివ్య శ్రీనివాస్, వెంకన్న, కోటేశ్వరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలి

నేలకొండపల్లి: గొర్రెల యూనిట్ల పంపిణీలో జాప్యం తగదని పాలేరు నియోజకవర్గ యాదవ్ సంఘం యూత్ అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీసి చాలా కాలం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో కె.రమేష్, కె.సీతారాములు, వెంకటప్పయ్య, యం.వెంకటేశ్వర్లు, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం ఖమ్మం నగరంలోని డివిజన్లలో, రూరల్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుల కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు



తిరుమలాయపాలెం: టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో..

మొక్కల పెంపకంతోనే భవిష్యత్

ఘనంగా హరితోత్సవం

- మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు



ఖమ్మంరూరల్: మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కందాళ



కూసుమంచి: మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ గౌతమ్



ఖమ్మంక్రైం: మొక్కలు నాటుతున్న సీపీ, మేయర్



రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఖమ్మం మయూరిసెంటర్: వసతి గృహంలో డీడీ కస్తాల సత్యనారాయణ,అధికారి రుక్మారావు..



మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న వనజీవి రామయ్య

ఖమ్మంరూరల్: మొక్కలతోనే భవిష్యత్ ముడిపడి ఉందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మద్దులపల్లిలో జరిగిన హరితోత్సవంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం. ఉమా, డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ అశోక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: హరితోత్సవంలో భాగంగా మండలంలోని నాయకన్‌గూడెం లో ఏర్పాటు చేసిన సంపద వనాన్ని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. అంతకు ముందు కలెక్టర్ వీపీ గౌతమ్ సంపదవనాన్ని సందర్శించారు. అక్కడ మొక్కను నాటారు. సంపదవనాన్ని ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, తహసీల్దారు మీనన్, ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, వైఎస్ ఎంపీపీ కంచర్ల పద్మ, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ కాసాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంక్రైం: పచ్చదనం ప్రగతికి సంకేతాలని సీపీ విష్ణు యస్ వారియర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్, నగర ఏసీపీ కార్యాలయంలో మొక్కలు నాటారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పదకొండు వేల రెండు వందల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, కార్పొరేటర్ లక్ష్మి, అడిషనల్ డీసీపీలు సుభాష్ చంద్రబోస్ కుమారస్వామి, ఏసీపీలు గణేష్, ప్రసన్నకుమార్, వెంకటస్వామి, ఆర్ఐలు రవి, శ్రీనివాస్, సాంబశివరావు, శ్రీశైలం, సీఐలు చిట్టిబాబు, తుమ్మాగోపి, స్వామి, శ్రీధర్, అంజలి, సత్యనారాయణ, శ్రీహరి పాల్గొన్నారు

నేలకొండపల్లి: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు మొక్కలు నాటారు. నేలకొండపల్లి కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, ఎంపీపీ రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎంపీఓ శివ, సర్పంచ్ రాయపూడి నవీన్, కార్యదర్శి దేవేందర్ పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఖమ్మంఅర్బన్/ఖమ్మం సహకారనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మిల్లుల వద్ద మొక్కలు నాటారు. ఖమ్మంలోని శ్రీ రామా మోడరన్ పారా బాయిల్డ్ రైస్ మిల్లు నందు మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఎస్ఓ రాజేందర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, సెక్రటరీ జవ్వాజి నగేష్ , ట్రెజరర్ చలువాది నగేష్ , బొమ్మ మధు , పుల్లారావు పాల్గొన్నారు.

ఖమ్మం మయూరిసెంటర్: హరితోత్సవంలో భాగంగా ప్రభుత్వ సాంఘిక క్షేమ వసతిగృహాల్లో శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ మొక్కలు నాటారు. నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ఎస్సీ బాలుర బి.ఆనందనిలయం బాలికల వసతిగృహాల్లో సంక్షేమ అధికారులు కోటపాటి రుక్మారావు, టి.విజయలక్ష్మి, విద్యార్థులు, వసతిగృహ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. హెచ్‌డబ్ల్యూఓ ఏ.శ్రీధర్, సిబ్బంది మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు నాటారు.


తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణిలో పంచాయతీ పరిధిలో మండల అధికారులు ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఎంపీడీఓ జయరాం, ఎస్సై వరాల శ్రీనివాస్, ఎంపీఓ రాజేశ్వరి, ఏపీఓ నర్సింహారావు, వెంకటేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెట్లు లేకనే వర్షాలు ఆలస్యం


ఖమ్మంరూరల్: చెట్లు లేకనే పచ్చదనం కరువై వర్షాలు ఆలస్యమయ్యాయని, రుతువులు గతులు తప్పుతున్నాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య అన్నారు. సోమవారం మండలంలోని నాయుడుపేటలో అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి. సురేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ హరికృష్ణ, కేజీబీవి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో...

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముత్తగూడెంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో డీసీ జనార్ధన్‌రెడ్డి, ఏసీ గణేష్, ఈఎస్ నాగేందర్‌రెడ్డి, సీఐ రాజిరెడ్డి, కిరణ్‌గౌడ్, ఎస్సై సరిత తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: కొక్కిరేణి పరిధిలో..



నేలకొండపల్లి: కొత్తకొత్తూరులో..